సాక్షి
ఖమ్మం
సోమవారం ၊ 4 ၊ మార్చి ၊ 2024



సొంతింటి దిశగా..
సొంతింటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించగా.. జిల్లాలో 3,69,633 మంది దరఖాస్తు చేసుకున్నారు. 8లో



మహిళలకు క్రీడా పోటీలు
టీజీఓస్ ఆధ్వర్యంలో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నాలుగో తరగతి మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 22°

వాతావరణం
జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. గంటగంటకూ ఎండ ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న డీఈఓ, ఆర్‌సీఓ

ఖమ్మంమయూరిసెంటర్ : మహాత్మా జ్యోతిబాపూలే విద్యాలయాల్లో(బీసీ గురుకులాలు) 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఖమ్మం రీజియన్‌లో 11 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్లు ఆర్‌సీఓ టి.అంజలి తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశాల కోసం 1,116 మంది దరఖాస్తు చేసుకోగా.. వెయ్యి మంది హాజరయ్యారని, 116 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఏడో తరగతిలో ప్రవేశానికి 754 మందికి 697 మంది, ఎనిమిదో తరగతిలో ప్రవేశాలకు 703 మంది విద్యార్థులకు 643 మంది హాజరయ్యారని వివరించారు. ఈ పరీక్షలను డీఈఓ సోమ శేఖర శర్మ పర్యవేక్షించారని తెలిపారు.

కొబ్బరిబోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఆలపాటి రామ్మోహనరావు

దమ్మపేట : రాష్ట్ర రైతుల ప్రయోజనం కోసం కొబ్బరిబోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామ్మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని శ్రీరాంపురంలో ఆదివారం నిర్వహించిన కొబ్బరి రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కొబ్బరి పంట ఎక్కువగా సాగు చేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కొబ్బరి సాగు ఎక్కువగా ఉన్న గ్రామ రైతులతో సొసైటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొబ్బరి బోర్డు ఏర్పాటు ద్వారా సబ్సిడీపై మొక్కలు, డ్రిప్, తదితర ప్రోత్సాహకాలు అందే అవకాశం ఉంటుందని చెప్పారు. కొబ్బరి సంబంధిత ఉత్పత్తుల పరిశ్రమలు కూడా రాష్ట్రంలో నెలకొల్పే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, యంద్రాతి అప్పారావు, దొడ్డా ప్రసాద్, దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

12 అడుగులకు పడిపోయిన 'పాలేరు'



నీరు తగ్గి వెలవెలబోతున్న పాలేరు రిజర్వాయర్

కూసుమంచి : పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం రోజురోజుకూ తగ్గుముఖం పడుతోంది. గత నెలలో మూడు రోజుల పాటు రిజర్వాయర్‌కు సాగర్ నుంచి నీరు విడుదల చేయడంతో 17.20 అడుగులకు చేరింది. అయితే నిర్ణయించిన మేరకు 1.5 టీఎంసీల నీరు సాగర్ నుంచి రాకపోవడంతో రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో 23 అడుగుల నీటిమట్టానికి నింపలేకపోయారు. ఇక సాగర్ నుంచి వచ్చిన నీటిని రోజువారీ తాగునీటి అవసరాలకు వినియోగిస్తుండడంతో నీటిమట్టం క్రమంగా తగ్గుతూ ఆదివారం నాటికి 12 అడుగులకు పడిపోయింది. ప్రస్తుతం రిజర్వాయర్ నుంచి నిత్యం 135.45 క్యూసెక్కుల నీటిని మిషన్ భగీరథ ప్రాజెక్టుతో పాటు పాలేరు డీఫ్లోరైడ్ ప్రాజెక్టులకు వినియోగిస్తున్నారు. ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లోని 2,439 గ్రామాలకు ఇక్కడి నుంచే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మరోమారు పాలేరుకు సాగర్ నుంచి నీరు విడుదల చేయకుంటే నీటిమట్టం మరింతగా తగ్గి రిజర్వాయర్ డెడ్‌స్టోరేజీకి చేరే ప్రమాదం ఉంది. అప్పుడు తాగునీటి పథకాలకు కూడా నీరందని పరిస్థితి నెలకొంటుందని ఈ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం హైదరాబాద్, ఖమ్మం జిల్లాలకు చెందిన భక్తులు విరాళం అందజేశారు. హైదరాబాద్ మణికొండకు చెందిన గోపీనాథ్ దంపతులు రూ. లక్ష, ఖమ్మం జిల్లా మధిరకు చెందిన దుర్గాప్రసాద్–అరుణ దంపతులు రూ.లక్ష చెక్కులను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. ఆలయ సిబ్బంది సాయిబాబు పాల్గొన్నారు.

ఇక మాస్‌లైన్‌తో ఉద్యమం

- చారిత్రక తప్పిదాలను సవరించుకునేందుకే విప్లవ పార్టీల విలీనం
- 'ఎంఎల్' నేతలు ప్రదీప్‌సింగ్, పోటు రంగారావు, సుభాష్ దేవ్
- ఖమ్మంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ
- ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు, నృత్యాలు



బహిరంగసభలో అభివాదం చేస్తున్న మాస్‌లైన్ నాయకులు ప్రదీప్‌సింగ్ ఠాగూర్, పోటు రంగారావు, రాయల చంద్రశేఖర్, గుమ్మడి నర్సయ్య తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్ : పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఇక నుంచి ఐక్యంగా పోరాడుతామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నేతలు ప్రకటించారు. మోదీ పాలనలో రాజ్యాంగ సంస్థలు విధ్వంసానికి గురయ్యాయని, ఆయన పాలన నియంతలను తలపిస్తోందని విమర్శించారు. ఆర్థికంగా, రాజకీయంగా, ప్రజాస్వామికంగా వ్యవస్థలను ఇబ్బంది పెడుతూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ పార్టీలు రాజకీయ సైద్ధాంతిక చర్చల తర్వాత సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పేరుతో ఒకే వేదిక మీదకు వచ్చాయని పేర్కొన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ యూనిటీ మహాసభ సందర్భంగా ఆదివారం ఖమ్మం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎస్ఆర్‌అండ్‌బీ జీఎన్ఆర్ కళాశాల మైదానం నుంచి ఇల్లెందు క్రాస్‌రోడ్, జెడ్పీసెంటర్, వైరా రోడ్, మయూరిసెంటర్ మీదుగా పెవిలియన్ గ్రౌండ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రవన్న, సంతోష్ రాణా మైదానం (పెవిలియన్ గ్రౌండ్)లో కెచ్చల రంగయ్య అధ్యక్షతన జరిగిన సభలో మాస్‌లైన్ నేత ప్రదీప్ సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ.. ఐక్యతకు ముందు గతంలో జరిగిన తప్పిదాన్ని విప్లవ పార్టీలు గుర్తించాయని, దాన్ని సరిచేసేందుకు భవిష్యత్‌లో బలమైన విప్లవోద్యమ నిర్మాణానికి మాస్‌లైన్‌గా అవతరించాయని తెలిపారు. ఇకపై రాజకీయ, సైద్ధాంతిక అవగాహనతో ముందుకు సాగుతామన్నారు. పాలకులు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు నిర్మిస్తామన్నారు. ఖమ్మం నగరంలో విప్లవ పార్టీల ఐక్యత మహాసభ జరగడం సంతోషకరమని, ఈ ప్రాంతం అనేక ప్రజా ఉద్యమాలకు వేదికగా నిలిచిందని ఠాగూర్ తెలిపారు. సీపీఐ నుంచి కొందరు చీలిపోయి సీపీఎంగా ఏర్పడ్డారని, ఆ తర్వాత సీపీఎం నుంచి తరిమెల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య, చండ్ర పుల్లారెడ్డి వంటి సీపీఐ(ఎంఎల్)గా విడిపోయారని వివరించారు. అనంతర కాలంలో చీలికలు పెరిగి విప్లవ పార్టీలు బలహీనపడ్డాయని తెలిపారు.

అతిపెద్ద పార్టీగా అవతరించేందుకే..

మొదటిసారి విప్లవ పార్టీలు కలిసి అతిపెద్ద కమ్యూనిస్టు పార్టీగా అవతరించాలనే లక్ష్యంతోనే మాస్‌లైన్ పేరుతో విలీనం అయ్యామని, ఇది ఒక చరిత్రాత్మక రోజని ఠాగూర్ పేర్కొన్నారు. పెట్టుబడిదారీ సమాజం నుంచి సోషలిజం సమాజం వైపు ప్రజలను మళ్లించేందుకే మాస్‌లైన్ పని చేస్తుందన్నారు. బీజేపీకి ప్రత్యామ్నాయం అంటూ 'ఇండియా' వేదిక వస్తోందని, అది రాజకీయ ప్రత్యామ్నాయమే తప్ప మరొకటి కాదని అన్నారు. ఈ ప్రత్యామ్నాయం అధికారానికే తప్ప బీజేపీ వ్యతిరేక విధానాలకు కాదన్నారు. కమ్యూనిస్టులు అధికారంలో ఉంటే సరళీకరణ విధానాలను అమలు చేస్తున్నారని, విపక్షంలో ఉంటే వ్యతిరేకిస్తున్నారని అన్నారు. మరో నేత పోటు రంగారావు మాట్లాడుతూ.. నరహంతక మోదీ పాలనలో దేశంలో ఒక భయానక పరిస్థితి నెలకొందన్నారు. మోదీ హిట్లర్‌కు వారసుడని ఆరోపించారు. సోషల్ మీడియా విష ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయోధ్య రాముడు, మసీదుల కూల్చివేతలే తమ కు అధికారాన్ని ఇస్తాయని ఫాసిస్టు శక్తులు భావిస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రజాస్వామిక తెలంగాణ రూపు దిద్దుకోలేదని, కేసీ ఆర్ పాలన నిజాంను తలపించిందని చెప్పారు. ఆయన సచివాలయాన్ని చూడలేదని, ప్రగతిభవన్ కు ఎవరినీ రానివ్వలేదని విమర్శించారు. ఆ పాపా లే కాంగ్రెస్‌ను గెలిపించాయని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ఆరు గ్యారంటీలతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణ హామీని కూడా అమలుచేయాలని డిమాండ్ చేశారు. సభలో పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు సంజయ్ సింఘ్వీ, దినేష్ గుహాయ్, కేజీ రామచందర్, కె.రమ, ఆర్.చంద్రశేఖర్, గుమ్మడి నర్సయ్య, పూజారి, జీవకుమార్, రవిబాబు, ప్రవీణ్ నట్టర్, సి.భాస్కర్, చిన్న చంద్రన్న, కె.సూర్యం, చంద్ర అరుణ, ఎస్ఎల్ పద్మ, హన్మేష్, వి.క్రిష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కదం తొక్కిన ఎర్రదండు..

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ యూనిటీ మహాసభ సందర్భంగా ఖమ్మం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు, నేపాల్, జర్మనీ దేశాల ప్రతినిధులు ప్రదర్శనలో పాల్గొన్నారు. గిరిజన సంప్రదాయ నృత్యాలు, కోలాటం, డప్పు నృత్యాలతో కళాకారులు ఆకట్టుకున్నారు.



బహిరంగ సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు

జిల్లాలో నేడు, రేపు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమ, మంగళవారాల్లో నల్గొండ, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో పర్యటించనున్నారు. నేడు ఉదయం 7 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 8.30 గంటలకు నల్గొండ జిల్లా నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశం ఇంటికి చేరుకుంటారు. 9 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి ఖమ్మం బైపాస్‌రోడ్‌లో వస్త్ర దుకాణాన్ని ప్రారంభిస్తారు. 11 గంటలకు సత్తుపల్లిలో నియోజకవర్గ, జిల్లా స్థాయి అధికారులతో జరిగే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. 2 గంటలకు సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో జరిగే బడ్జెట్ సమావేశంలో పాల్గొంటారు. 5 గంటలకు వైరాలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహిస్తారు. 6.30 గంటలకు ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్‌లోని నివాసానికి చేరుకుని రాత్రి అక్కడ బస చేస్తారు. మంగళవారం ఉదయం 9 గంటలకు నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెంలో పశు వైద్యశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 10.30 గంటలకు తిరుమలాయపాలెంలో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభిస్తారు. 11 గంటలకు రామచంద్రాపురంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. 11.30 గంటలకు నేలకొండపల్లి మండల కేంద్రంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 12 గంటలకు మోడల్ డిగ్రీ కళాశాలను ప్రారంభిస్తారు. 3 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 4 గంటలకు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొంటారు.

డీసీపీగా ప్రసాద్‌రావు

ఖమ్మంక్రైం : ఖమ్మం కమిషనరేట్ లా అండ్ ఆర్డర్ డీసీపీగా జి.ప్రసాద్‌రావును నియమిస్తూ డీజీపీ రవిగుప్తా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాచకొండ కమిషనరేట్‌లో ఎల్‌బీ నగర్ ఎస్‌ఓటీ ఏసీపీగా పనిచేస్తున్న ఆయనను ఖమ్మానికి బదిలీ చేశారు. ఇక కమిషనరేట్ అడ్మిన్ డీసీపీగా భూపాలపల్లి ఏఎస్పీగా పనిచేస్తున్న నరేష్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. 466 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.15,480, 200 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.7,760 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పల్స్‌పోలియో విజయవంతం

- జిల్లాలో 96 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు
- ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాలలో ప్రారంభించిన కలెక్టర్ గౌతమ్

ఖమ్మం వైద్యవిభాగం : జిల్లాలో పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ఆదివారం తొలి రోజే 96 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. జిల్లాలో 1,30,747 ఐదేళ్ల లోపు చిన్నారులు ఉన్నట్లు గుర్తించగా తొలిరోజు 1,25,519 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అందుకోసం 6,973 వాయిల్స్‌ను వినియోగించారు. సోమ, మంగళవారాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి మిగిలిన చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయనున్నారు. కాగా, ఖమ్మంలోని మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కేంద్రంలో కలెక్టర్ వి.పి.గౌతమ్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్

పోలియో రహిత సమాజం కోసం పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు వారందరికీ ఈ చుక్కలు వేయించాలని సూచించారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, లైబ్రరీలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రత్యేక కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 1.30 లక్షల మంది చిన్నారులు ఉన్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా గుర్తించామని, అందరికీ చుక్కలు వేసేందుకు వైద్యారోగ్య, సంక్షేమ, మున్సిపల్ ఇతర శాఖల సిబ్బందిని సమకూర్చామని చెప్పారు. ఆదివారం రోజున వేయించని చిన్నారులకు సోమ, మంగళవారాల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ అధికారి డాక్టర్ ప్రమీల, డాక్టర్ లక్ష్మీ లోహిత, ఆరోగ్య పర్యవేక్షకులు తాళ్లూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వీడీఓస్ కాలనీలో డీఎంహెచ్‌ఓ..

నగరంలోని వీడీఓస్ కాలనీలో ఆదివారం నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమానికి డీఎంహెచ్‌ఓ వి. సుబ్బారావు హాజరయ్యారు. స్థానిక కార్పొరేటర్ మిక్కిలినేని మంజులతో కలిసి ఆయన పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో మాతా శిశు సంక్షేమ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సైదులు, స్థానిక నాయకులు మిక్కిలినేని నరేంద్ర, డాక్టర్ కృష్ణ చైతన్య, మెప్మా అధికారులు వెంకటేశ్వరు, సుజాత పాల్గొన్నారు. కాగా, 25వ డివిజన్‌లో కార్పొరేటర్ గోళ్ల చంద్రకళ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గోళ్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఇంటర్' మూల్యాంకనం

జిల్లాకు 4,44,759 జవాబుపత్రాల కేటాయింపు..

ఖమ్మం సహకారనగర్ : ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 19న ముగియనున్న నేపథ్యంలో అధికారులు జవాబుపత్రాల మూల్యాంకనంపై దృష్టి సారించారు. నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాల్యూయేషన్ సెంటర్ ఏర్పాటు చేయగా సోమవారం సంస్కృత సబ్జెక్ట్‌కు సంబంధించిన మూల్యాంకనం ప్రారంభించనున్నారు. ప్రధాన సబ్జెక్ట్‌ల వాల్యూయేషన్ ప్రక్రియ ఈనెల 16నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 4,44,759 జవాబుపత్రాలు జిల్లాకు చేరుకోనున్నాయి.

నాలుగు విడతల్లో..

ఇంటర్ జవాబుపత్రాలను నాలుగు విడతలుగా మూల్యాంకనం చేయనున్నారు. నేటి నుంచి సంస్కృత సబ్జెక్టు ప్రారంభం అవుతుండగా 16వ తేదీ నుంచి ఇంగ్లీష్ 1, 2, తెలుగు 1, 2, హిందీ 1, 2, మ్యాథ్స్ పేపర్ 1(ఏ), 1(బి), 2(ఏ), 2(బి), పొలిటికల్ సైన్స్ పేపర్ 1, 2 జవాబుపత్రాలు దిద్దనున్నారు. ఇక ఈ నెల 20 నుంచి ఫిజిక్స్ పేపర్–1, 2, ఎకనామిక్స్ పేపర్– 1, 2 దిద్దనున్నారు. 22 నుంచి కెమిస్ట్రీ పేపర్–1, 2, కామర్స్ పేపర్–1, 2 జవాబు పత్రాల మూల్యాంకనం చేయనున్నారు. 24 నుంచి హిస్టరీ పేపర్–1, 2, బోటనీ పేపర్–1, 2, జువాలజీ పేపర్–1, 2 దిద్దనున్నారు.



సిబ్బంది కేటాయింపు ఇలా..

వాల్యూయేషన్ వద్ద క్యాంప్ ఆఫీసర్‌గా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు వ్యవహరించనుండగా అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్–1(ఏసీవో)గా కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పుతుంబాక శ్రీనివాసరావు, ఏసీవో–2గా ఫిజిక్స్ లెక్చరర్ ప్రవీణ్‌కుమార్ వ్యవహరిస్తారు. సుమారు 1,500 మంది విధులు నిర్వహించే అవకాశం ఉంది.

ఏర్పాట్లు పూర్తి చేశాం



ఇంటర్మీడియట్ మూల్యాంకనం ప్రక్రియ జిల్లాకు సంబంధించి నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేస్తున్నాం. ఈ ప్రక్రియ నేటి(సోమవారం) నుంచి సంస్కృత సబ్జెక్ట్‌తో ప్రారంభం కానుంది. మూల్యాంకనానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం.
– కె.రవిబాబు, డీఐఈఓ

డీసీసీబీ బలోపేతానికి కృషి

చైర్మన్ దొండపాటి



దొండపాటిని సన్మానిస్తున్న రిక్రియేషన్ క్లబ్ సభ్యులు

మధిర: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఇటీవల బాధ్యతలు చేపట్టిన దొండపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మధిర రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నిక కావడంతో ఆయనను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో దొండపాటి మాట్లాడుతూ.. ఖమ్మం సెంట్రల్ బ్యాంక్ నాలుగు జిల్లాల పరిధిలో ఉందన్నారు. సెంట్రల్ బ్యాంకును మరింత అభివృద్ధి చేసి మధిరకు మంచి పేరు తీసుకొస్తానని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో కట్టా గాంధీ, కొంకా రమేష్, కటకం రాంబాబు, ములకలపల్లి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

మాట ఇచ్చాం.. అమలు చేస్తున్నాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మధిర, ఎర్రుపాలెం మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మధిరలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులు

మధిర/ఎర్రుపాలెం : ఎన్నికల సమయంలో సంక్షేమ పథకాలకు సంబంధించి ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మధిర, ఎర్రుపాలెం మండలాల్లో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. మధిర మండలం రొంపిమళ్ల నుంచి ఎండపల్లి గుట్టల వరకు, జాలిముడి గ్రామం నుంచి జాలిముడి ప్రాజెక్టు వరకు, ఎర్రుపాలెం మండలం మండలం అయ్యవారిగూడెం నుంచి బుచ్చిరెడ్డిపాలెం వరకు, భవానీపురం నుంచి కాచవరం వరకు నిర్మించనున్న బీటీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మాట్లాడుతూ.. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలు అమలు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చి మూడు నెలలు కాకముందే గ్యారంటీలు అమలు చేయడం లేదని ఆ పార్టీ నాయకులు విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రజల కోసం పనిచేసే నిబద్ధత తమ ప్రభుత్వానికి ఉందన్నారు. తాము ప్రకటించిన గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం రూ.10 లక్షలకు పెంపు, రూ. 500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేశామని వివరించారు. మూడు నెలల్లోనే 25వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, గత ప్రభుత్వం ఒక్క గ్రూప్ వన్ నోటిఫికేషన్ కూడా వేయలేదని ఎద్దేవా చేశారు. బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశామని తెలిపారు.

పక్కా భవనాలు నిర్మిస్తాం..

రాష్ట్రంలో అద్దె భవనాలు, అరకొర వసంతల మధ్య నడుస్తున్న రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలకు భవన నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు భట్టి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలలను ఒకేచోట నిర్మించి కామన్ ప్లే గ్రౌండ్, ల్యాబ్స్, తదితర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రపంచ స్థాయిలో పోటీపడేలా చదువు అందించడమే లక్ష్యంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దుతామని తెలిపారు. వడ్డీ లేని రుణాలను నిలిపివేసిన గత ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని ఆరోపించారు. గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి అమలు చేసినట్టుగా డ్వాక్రా మహిళలకు త్వరలోనే వడ్డీ లేని రుణాలు ఇస్తామని చెప్పారు. సంపద సృష్టించడం, దాన్ని ప్రజలకు పంచడమే తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. మధిర మండలం ఎండపల్లి గుట్టల వద్ద ఉన్న భూములను పారిశ్రామిక వాడగా మార్చబోతున్నట్లు ప్రకటించారు. జాలిముడి ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువల ద్వారా రెండు మండలాలకు తాగు, సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. జాలిముడి ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. తొలుత గన్నవరం విమానాశ్రయం నుంచి ఎన్టీఆర్ జిల్లా మైలవరం మీదుగా ఎర్రుపాలెం మండలం రాజుపాలెం గ్రామానికి చేరుకున్న భట్టికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మధిర, ఎర్రుపాలెం ఎంపీపీలు మెండెం లలిత, దేవరకొండ శిరీష, జెడ్పీటీసీ శీలం కవిత, ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు తల్లపురెడ్డి ప్రవల్లిక, శీలం జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ఈనెల 1 నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టామని, జిల్లాలో 10,265 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇందులో 1,300 దరఖాస్తులు పరిష్కరించామని, 800 దరఖాస్తులను ఆమోదించి, రైతులకు పాస్ బుక్‌ల జారీకి సిఫారసు చేశామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఆర్డీఓ, కలెక్టరేట్ కార్యాలయాల్లో ఆదివారం కూడా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా మండలాల పరిధిలో ధరణి మాడ్యూల్స్ ప్రకారం చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి ప్రతి దరఖాస్తును నమోదు చేశామన్నారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను నమోదు చేసుకుని, రికార్డులో ఉన్న వాటిని సరిపోల్చుకొని నిర్ణయం తీసుకోనున్నామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఎస్‌డీసీ ఎం. రాజేశ్వరి, కలెక్టరేట్ ఏఓ అరుణ, పర్యవేక్షకులు మదన్‌గోపాల్, మీనన్, సత్యనారాయణ, రాంబాబు, ఓఎస్డీ నాగేశ్వరరావు, ధరణి కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వన్య ప్రాణుల సంరక్షణకు కృషి చేయాలి


విజేతలకు బహుమతి అందజేస్తున్న వనజీవి రామయ్య

తిరుమలాయపాలెం: వన్య ప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పద్మశ్రీ వనజీవి రామయ్య అన్నారు. ఆదివారం మండలంలోని దమ్మాయిగూడెం శ్రీ సరస్వతి విద్యాలయంలో అటవీశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వన్యప్రాణుల సంరక్షణ గురించి విద్యార్థులకు వివరించాక వన్య ప్రాణులపై వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి రేంజ్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పి.సురేశ్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్ దానియేలు, బీట్ ఆఫీసర్ హరికృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ మధు, గ్రామ పెద్దలు శ్యాం సుందర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిమిక్రీ కళాకారుడికి అవార్డు


అవార్డుతో దయాకర్ స్వామి

ఖమ్మంగాంధీచౌక్: నగరానికి చెందిన మిమిక్రీ కళాకారుడు డాక్టర్ దామెర దయాకర్ స్వామికి సర్ సీ.వీ.రామన్ అకాడమీ సాంస్కృతిక సేవా సంస్థ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం నుంచి ధ్వన్యనుకరణ సామ్రాట్ అవార్డు దక్కింది. ఆదివారం హైదరాబాద్ హరిహర కళాభవన్‌లో సంస్థ 28వ వార్షికోత్సవంలో భాగంగా ఉగాది మహోత్సవాన్ని పురస్కరించుకొని పలు అంశాల్లో పలువురికి పురస్కారాలు, అవార్డులను అందించి సత్కరించారు. అందులో భాగంగా దామెర దయాకర్ స్వామికి అవార్డుతో పాటు సువర్ణ గంట కంకణం, గోల్డ్ మెడల్‌ను అందించారు. ఈ సందర్భంగా దయాకర్ స్వామికి కళాకారులు, తదితరులు అభినందనలు తెలిపారు.

ఎస్‌పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ బదిలీ


జంగయ్య

పాల్వంచ: జిల్లాలోని కేటీపీఎస్, బీటీపీఎస్ కర్మాగారాలకు చెందిన స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అడిషనల్ కమాండెంట్ సి.జంగయ్య బదిలీ అయ్యారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి బదిలీ అవుతున్నట్లు ఉత్తర్వులు అందాయి. జంగయ్య 2021 డిసెంబర్‌లో ఇక్కడ అసిస్టెంట్ కమాండెంట్‌గా విధుల్లో చేరగా.. ఇటీవల అడిషనల్ కమాండెంట్‌గా పదోన్నతి లభించింది. కాగా, ఇక్కడ ప్రస్తుతం అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.అప్పాజీ పూర్తిస్థాయి పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించనున్నారు.

కిన్నెరసాని క్రీడా పాఠశాలలో ఎంపికలు

పాల్వంచరూరల్: మండల పరిధి కిన్నెరసాని క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఈ నెల 5, 6వ తేదీన విద్యార్థులకు బ్యాటరీ టెస్ట్ ద్వారా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ క్రీడాల అధికారి గోపాల్‌రావు ఆదివారం తెలిపారు. ఐటీడీఏ పీఓ, డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాల మేరకు మంగళ, బుధవారాల్లో కిన్నెరసాని క్రీడా పాఠశాలలో 40 మంది బాలురు, కాచనపల్లి బాలికల క్రీడా పాఠశాలలో 40 మంది విద్యార్థినులు, వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోయినపల్లి హైదరాబాద్‌కు 20 మంది బాలికలు, 20 మంది బాలురను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 31, 2024 నాటికి 9 నుంచి 11ఏళ్ల వయసు కలిగిన నాలుగో తరగతి విద్యార్థులు మాత్రమే అర్హులని, ఎంపికకు వచ్చేటప్పుడు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్ ఫొటోను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న 'నిర్విరామ నృత్య నీరాజనం'


కళాకారులతో నిర్వాహకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం అహోబిల మఠంలోని శ్రీనృసింహ సేవావాహిని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహించిన 12 గంటల నిర్విరామ నృత్య నీరాజనం కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. అంతేకాక తెలుగు బుక్‌ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌తో పాటు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఆదివారం ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు నిర్విరామంగా సాగిన నృత్యాల ప్రదర్శనతో కళాకారులు అవార్డులు సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ యూనియన్ మెంబర్ అశోక్, అనుమాండ్ల నాగరాజు, వనపర్తి పద్మావతి, పోకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,045

సొంతింటి దిశగా..

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సర్కారు శ్రీకారం

- దరఖాస్తుదారుల్లో వ్యక్తమవుతున్న హర్షాతిరేకాలు
- ఉమ్మడి జిల్లాలో 35 వేల ఇళ్లు వచ్చే అవకాశం



చుంచుపల్లి: ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మరో గ్యారంటీ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 11న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో అర్హులలో ఆశలు రేకెత్తుతున్నాయి. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థికసాయం చేయడంతోపాటు స్థలంలేని వారికి జాగా కూడా ఇవ్వనుంది. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేయనుండగా, ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాలకు 35 వేల ఇళ్లు వచ్చే అవకాశం ఉంది.

వైఎస్ హయాంలో విజయవంతంగా అమలు..

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2006లో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం అమల్లోకి తెచ్చి నిరుపేదలకు పక్కా ఇళ్ల నిర్మించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4.10 లక్షల ఇళ్లను మంజూరు చేయగా దాదాపు 3 లక్షల ఇళ్లను పూర్తి చేశారు. ఇక 2014లో స్వరాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇందిరమ్మ పథకంలో స్థానంలో 2015లోడబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకాన్ని తెచ్చింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5.40 లక్షలు ఇవ్వాలని నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాకు 15,399 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో భద్రాద్రి జిల్లాకు 6,443 ఇళ్లు, ఖమ్మం జిల్లాకు 8,956 ఇళ్లు ఇచ్చింది. అయితే ఇళ్ల నిర్మాణం అన్ని చోట్ల నత్తనడకనే సాగింది. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు ఇళ్లు లేని నిరుపేదలు సొంత జాగాను కలిగి ఉంటే రూ.3 లక్షల వరకు సాయం అందిస్తామని గృహలక్ష్మి పథకం తెచ్చింది. ఉమ్మడి జిల్లాలో భారీగా దరఖాస్తులు స్వీకరించి, విచారణ చేసి కొందరు లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ సైతం అందజేశారు.

అప్పటి సిబ్బందిలో ఆశలు..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2014లో హౌసింగ్ శాఖను పూర్తిగా రద్దు చేసి, అధికారులు, ఉద్యోగులను ఆర్ అండ్‌బీ శాఖలో విలీనం చేసింది. మరికొందరిని ఇతర శాఖలకు పంపింది. గతంలో అన్ని మండలాల్లో గృహ నిర్మాణ శాఖ పరిధిలో ఏఈల కార్యాలయాలు ఉండగా, నియోజకవర్గానికి ఒకరు చొప్పు న డీఈలు, రెవెన్యూ డివిజన్లకు ఒక్కొక్కరు చొప్పున ఈఈలు, జిల్లా స్థాయిలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఒకరు ఉండేవారు. ప్రధాన పట్టణాల్లో పట్టణ ఏఈలు, డీఈలు సైతం ఉండేవారు. ఇక మండలానికి నలుగురు, ఐదుగురు చొప్పున వర్క్ ఇన్స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఉండేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం పునరుద్ధరిస్తుండటంతో గతంలో పనిచేసి సిబ్బందిలో కూడా ఆశలు చిగురిస్తున్నాయి. తమకు అనుభవం ఉన్నందున పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయగలమనే భావనలో వారిలో వ్యక్తమవుతోంది.

6,49,271 దరఖాస్తులు

కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో విజయవంతంగా అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో గత జనవరిలో ప్రజాపాలన గ్రామసభల్లో అర్హుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,21,541 ప్రజాపాలన దరఖాస్తులు రాగా, వాటిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 6,49,271 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఖమ్మం జిల్లాలో 3,69,633, భద్రాద్రి జిల్లాలో 2,79,638 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గృహ నిర్మాణ శాఖకు ఇందిరమ్మ పథకం అమలు బాధ్యతను అప్పగించింది.

ఆర్థికసాయం వస్తుందని..



ప్రభుత్వం జనవరిలో చేపట్టిన ప్రజాపాలన ద్వారా ఇందిరమ్మ ఇంటి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నాను. నాకు సొంత జాగా ఉంది. ప్రభుత్వం రూ.5 లక్షల సాయం ఆర్థికసాయం చేస్తే ఇల్లు నిర్మించుకుంటాను. ఇందిరమ్మ ఇంటి పథకం వర్తిస్తుందని ఆశిస్తున్నాను. ఈ పథకం నిరుపేదలకు ఎంతో ఉపయోగం.

–పట్నం సుగుణ, బాబుక్యాంపు, చుంచుపల్లి

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మవిశ్వాసం

సినీనటుడు సుమన్


మాట్లాడుతున్న సినీనటుడు సుమన్

ఖమ్మం స్పోర్ట్స్ : మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, భవిష్యత్‌లో రాబోయే పరిణామాలను ఎదుర్కొనే అవకాశం ఉంటుందని సినీనటుడు సుమన్ అన్నారు. ఖమ్మం నగరంలోని వర్తక సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సుమన్ మాట్లాడుతూ.. ప్రధానంగా మహిళలు కరాటేలో ప్రావీణ్యం సంపాదించాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని కరాటే విద్యార్థులు మరింత అభివృద్ధి సాధించేలా మార్షల్ ఆర్ట్స్ కృషి చేయాలని సూచించారు. ఒక రోజుకు పరిమితంగా నిర్వహించిన ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తా..


శ్రీనివాసరావును సన్మానిస్తున్న సొసైటీ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ డ్రైవర్ల సంఘానికి ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలో నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల మ్యూచువల్ ఐడెంటి హౌస్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇళ్ల స్థలాలు రాకకై సీఎంతో మాట్లాడేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ సలీం మాట్లాడాక.. ప్రతీ మహాజన సభలో ముగ్గురు డైరెక్టర్లను తొలగించి చైర్మన్, డైరెక్టర్ల ఆధ్వర్యాన కొత్తగా మరో ముగ్గురు డైరెక్టర్లను ఎన్నుకున్నారు. అనంతరం ఏలూరి శ్రీనివాసరావును హౌస్ బిల్డింగ్ సొసైటీ బాధ్యులు సన్మానించారు. ఎండీ సలీం అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్య సలహాదారుడు కె.కోటేశ్వరరావు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వీజీకే మూర్తి, గౌరవ అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ హకీమ్, వైస్ చైర్మన్ దాసరి వేణుగోపాల్, జి.రాములు, బి.రామారావు, వనమా శ్రీనివాసరావు, బానోత్ హరిసింగ్, మామిడి బాబూరావు, ఆదినారాయణ, గంగన్న, పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు


కబడ్డీ పోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ నాలుగో తరగతి మహిళా ఉద్యోగులకు ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తెలంగాణ గెజిటెడ్ సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పోటీల్లో పురుషులతో సమానంగా రాణించి క్రీడా స్ఫూర్తి చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర కార్యదర్శి కొండూరు గంగాధర్, కస్తాల సత్యనారాయణ, వేలాద్రి, నాలుగో తరగతి రాష్ట్ర సంఘం అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, మహిళా సంఘం ప్రతినిధులు పి.అంజమ్మ, కె.కృష్ణవేణి, సావిత్రి, కోడి లింగయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, సాయంత్రం వేళ మహిళలకు కబడ్డీ, టెన్నికాయిడ్, టాగ్ ఆఫ్ వార్, పరుగు పందెం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

గిరిజన రైతు పంటను ఎత్తుకెళ్లిన కమీషన్ వ్యాపారి

అవమానభారంతో రైతు ఆత్మహత్యాయత్నం

కామేపల్లి: ఓ గిరిజన రైతు పంట సాగు కోసం తీసుకున్న అప్పు చెల్లించలేదంటూ కమీషన్ వ్యాపారి కల్లంలో ఉంచిన పంటను ఎత్తుకెళ్లిన ఘటన కామేపల్లి మండలం గోవింద్రాలలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆలోత్ సీతారాం అనే గిరిజన రైతు ఈ ఏడాది రెండున్నర ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాడు. ఇందుకోసం ఖమ్మంలోని బానోత్ దస్రూ అనే కమీషన్ వ్యాపారి వద్ద నాలుగు నెలల క్రితం రూ.50 వేలు అప్పు తీసుకున్నాడు. ఈ క్రమంలో 20 రోజుల క్రితం కూలీలతో మిర్చి కోయించిన సీతారాం.. కల్లంలో ఆరబెట్టి తాలు వేరు చేసి ఉంచాడు. శనివారం రాత్రి బస్తాల్లో నింపి సోమవారం మార్కెట్‌లోని సదరు కమీషన్ వ్యాపారి వద్దకు తీసుకెళ్లేందుకు సిద్ధం అవుతుండగానే.. కమీషన్ వ్యాపారి రైతు కల్లం వద్దకు చేరుకుని తన అప్పు తీర్చలేదంటూ వాదనకు దిగాడు. దీంతో పంటను సోమవారం మార్కెట్‌కు తీసుకొస్తానని, విక్రయించిన తర్వాత అసలు, వడ్డీ చూసుకుని మిగితాది తనకు ఇవ్వాలని సీతారాం కోరినా వ్యాపారి వినకుండా 60 బస్తాల మిర్చిని ట్రాలీ ఆటోలో ఎత్తుకెళ్లాడు. సీతారాంతో పాటు అతడి భార్య చిన్ని అడ్డుకోబోగా ఇద్దరినీ చంపుతానని బెదిరించాడు. దీంతో అవమానంగా భావించిన సీతారాం కలుపుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు బాధితుడిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన ట్రాలీ ఆటో

ముదిగొండ: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దమండవ నుంచి రేషన్ డీలర్ల వద్ద 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా ట్రాలీ ఆటోలో తరలిస్తున్నారు. ఈక్రమంలో బాణాపురం వైపు వస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం పట్టుకున్న ట్రాలీ ఆటోను, డ్రైవర్, తరలిస్తున్న మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి ముదిగొండ పోలీసులకు అప్పగించారు.

మహబూబాబాద్ ఎంపీ స్థానాన్ని ఆదివాసీలకే ఇవ్వాలి

భద్రాచలంటౌన్: ఆదివాసీలు అధికంగా ఉన్న మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకర్గం నుంచి రాబోయే ఎన్నికల్లో ప్రధాన పార్టీలు ఆదివాసీలకే టికెట్ కేటాయించాలని ఆదివాసీ అఖిలపక్షం ప్రజా సంఘాల జేఏసీ జాతీయ కన్వీనర్ చంద లింగయ్యదొర అన్నారు. ఆదివారం భద్రాచలం పట్టణంలో ఆదివాసీ అఖిలపక్షం ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యాన జరిగిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంట్‌లో 2.50లక్షల మంది లంబాడాలు ఉన్నారని తెలిపారు. మెజార్టీ ఉన్న ఆదివాసీలను ప్రధాన రాజకీయ పార్టీలు విస్మరించి లంబాడాల కార్పొరేట్ శక్తులకే పెద్దపీట వేస్తున్నాయని ఆరోపించారు. ఒకవేళ ఆదివాసీలకు టికెట్ కేటాయించలేనిపక్షంలో ఒంటరిగా పోటీ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పొడుగు శ్రీనాథ్, వట్టం నారాయణ, రామకృష్ణ, శ్రీరామమూర్తి, లక్ష్మయ్య, శ్రీను, నరసింహారావు, లక్ష్మయ్య, శ్రీను, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ గౌడ్

చుంచుపల్లి: అణగారిన బీసీ వర్గాల అభివృద్ధి కేవలం కేవలం బీజేపీతోనే సాధ్యమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ అన్నారు. ఆదివారం కొత్తగూడెం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ఓబీసీ సామాజిక సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా తెలంగాణలో లక్షల కుటుంబాలు ఆర్థికంగా బలపడే అవకాశం కలిగిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించడం, కేబినెట్‌లో 27మంది బీసీలకు మంత్రులుగా అవకాశం కల్పించడం, బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో అధిక ప్రాధాన్యతనిస్తూ బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు కే.వీ.రంగాకిరణ్ మాట్లాడుతూ.. జిల్లాలో విశ్వకర్మ యోజన పథకానికి అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంతేకాక రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీసీలందరూ బీజేపీకి ఓటు వేసేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేశ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బిట్రగుంట క్రాంతికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలచెర్వు శ్రీనివాసరావు, అధికార ప్రతినిధి పోనిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు సాయిరాం, లక్ష్మణచారి, కేశగాని శ్రీనివాస్‌గౌడ్, గౌడుగు శ్రీధర్, రపాక రమేశ్, గంధం నాగేంద్ర ప్రసాద్, వెలిశెట్టి రామారావు, భోగి చందర్ రావు,మీసాల దుర్గారావు, మాధవ్,రేవెళ్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని గ్రానైట్ కార్మికుడి మృతి

ముదిగొండ: ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలోని కల్పన గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఓ కార్మికుడు ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చిన రితేశ్ (24) గతకొద్ది కాలంగా గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా చేరాడు. అనారోగ్య కారణంగా ఆదివారం పారిశ్రామిక ప్రాంతంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకున్నాడు. దీంతో గ్రానైట్ యజమాని కిశోర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ నరేశ్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఆత్మహత్య

కట్టంగూర్: నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్(బీపీఎం) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ఎన్.శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణానికి చెందిన దేవరపల్లి యమున(30) ఆరు నెలల క్రితం అయిటిపాముల బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా విధుల్లో చేరింది. అయిటిపాములలోనే అద్దె ఇంట్లో ఉంటున్న యమున ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తలుపులు తీయకుండా ఉండడంతో చుట్టుపక్కల వారు గమనించి నల్లగొండలో ఉంటున్న ఆమె బంధువులకు సమాచారం ఇచ్చారు. నల్లగొండ నుంచి వచ్చిన బంధువులు తలుపులు తీసి చూసేసరికి యమున చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించింది. యమున మృతిపై అనుమానం ఉందని ఆమె అన్న దేవరపల్లి దుర్గాప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

పాల్వంచరూరల్: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని నారాయణరావుపేట గ్రామంలో ప్రీమియర్ లీగ్ టీపీఎస్ మెమోరియల్‌కప్ మండలస్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడల వల్ల దేహదారుఢ్యం, స్నేహభావం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యర్రపోతు సంతోశ్‌కుమార్, అఖిల్, కె.వంశీ, నాయకులు కొండం వెంకన్న, కోమటిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, గండు భరత్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

దమ్మపేట: కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన ఆదివా రం మండల పరిధిలోని పాత చీపురుగూడెం గ్రామ శివారు చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై సాయికిశోర్‌రెడ్డి ఆధ్వర్యాన పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'మాస్‌లైన్' తడాఖా..

పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు మూడు విప్లవ పార్టీలు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ యూనిటీగా ఆదివారం అవతరించింది. తొలుత నగరంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ఆర్‌ఐ పార్టీల జాతీయ, రాష్ట్ర నాయకులు భారీ ప్రదర్శన తీశారు. అనంతరం జరిగిన మహాసభలో పలువురు నేతలు మాట్లాడుతూ.. చారిత్రక తప్పిదాలను సవరించుకునేందుకే విప్లవ పార్టీలు విలీనమైనట్లు పేర్కొన్నారు. ఈనేపథ్యాన కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అందరిలో జోష్ నింపి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



ర్యాలీ తీస్తున్న జాతీయ, రాష్ట్ర నాయకులు


ర్యాలీలో కళాకారుల నృత్యాలు


కొమ్ము డప్పు నృత్యం


సభ వేదికపై పాటలు పాడుతున్న అరుణోదయ కళాకారులు


ఎర్రజెండాతో చిన్నారి


సభా కార్యక్రమాలను సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న మహిళా కార్యకర్త